TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 94 | శుక్రవారం, ఆగస్టు 2, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4


## రాజీవ్ గాంధీ దేశానికి కంప్యూటర్‌ను పరిచయం చేశారు: రేవంత్



హైదరాబాద్: దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి కంప్యూటర్‌ను పరిచయం చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు హైటెక్‌సిటీలో ఐటికి పునాది రాయి వేశారని గుర్తు చేశారు. స్కిల్ వర్సిటీ బిల్లుపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. హైదరాబాద్‌లో ఐటిరంగ నిపుణుల తయారీకి కాంగ్రెస్ కృషి చేసిందని, కాంగ్రెస్ వేసిన పునాదిరాయితో హైదరాబాద్‌లో ఐటి రంగం వేళ్లూనుకుందని, ప్రపంచంలో భారత ఐటి నిపుణుల్లో ఐదుగురు భారతీయులు ఉన్నారని, అందులో ఒకరు తెలుగు వారు ఉన్నారని కొనియాడారు.

విద్య, నీటిపారుదలకు దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదటి ప్రాధాన్యత ఇచ్చారని, మారుమూల ప్రాంతాల్లో విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేశారని, ప్రతి పేదవాడికి విద్య అందాలన్న లక్ష్యంతో రిజర్వేషన్లు తీసుకొచ్చామని, రెసిడెన్షియల్ స్కూళ్ల ద్వారా పేదలకు విద్యను అందుబాటులోకి తెచ్చామని ఆయన తెలియజేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో అభివృద్ధి పథంలో నడిపించేందుకు నెహ్రూ పునాది వేశారని, ఎస్సి, ఎస్టిలకు దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ఉపాకల వేతనాలు అందించారని ప్రశంసించారు. ఇందిరాగాంధీ ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పారని, ఎస్సి, ఎస్టిలకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని మెచ్చుకున్నారు.

### వయనాడ్ విలయ బాధిత కుటుంబాలకు...

# రాహుల్ గాంధీ పరామర్శ



వయనాడ్: కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలో మృతిచెందిన వారి సంఖ్య 288కి చేరుకుంది. అయితే.. ప్రమాదానికి కేంద్ర స్థానమైన చూర్‌మలాలో గురువారం రాహుల్ గాంధీ, ప్రియాంకా పర్యటించారు. అక్కడ బాధిత కుటుంబాలను పరామర్శించారు. మెప్పాడిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బాధితులను కలుసుకున్నారు. అక్కడ నుంచి డాక్టర్ మూపెన్స్ మెడికల్ కాలేజీకి వెళ్తన్నారు. మెప్పాడీలో రెండు రిలీఫ్ క్యాంప్‌లు ఉన్నాయి. రాహుల్, ప్రియాంకాలతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఎంపీ కేసీ వేణుగోపాల్ కూడా ఉన్నారు. వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీ 2019లో గెలుపొందారు. ఆ తర్వాత ఈ ఏడాది ఎన్నికల్లోనూ ఆయన విజయం సాధించారు. కానీ రాయ్‌బరేలీలో కూడా లోక్‌సభ స్థానాన్ని నెగ్గడంతో.. వయనాడ్ స్థానాన్ని ఆయన వదులుకున్నారు. అయితే వయనాడ్ నుంచి ప్రియాంకా గాంధీ .. ఉప ఎన్నికల్లో పోటీ పడే అవకాశాలు ఉన్నాయి. ఇవాళ ఉదయం కన్నూర్ విమానాశ్రయంలో రాహుల్, ప్రియాంకాలు దిగారు. రోడ్డు మార్గం ద్వారా వయనాడ్ వెళ్లారు.

### ఆ ఇద్దరికి డీఎస్పీ ఉద్యోగాలు...

# ధరణి కాదు... భూమాత



హైదరాబాద్: కొత్త రేషన్ కార్డుల జారీకి తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత నిర్వహించిన కేబినెట్ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో పలు అంశాలకు సంబంధించి కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ధరణి పోర్టల్ ను భూమాతగా మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే పైలట్ ప్రాజెక్ట్ కింద సాగర్ లోని ఓ మండలం ఎంపికకు నిర్ణయం తీసుకుంది. వయనాడ్ మృతులకు తెలంగాణ కేబినెట్ సంతాపం తెలిపింది. వయనాడ్ బాధితులకు ఆర్థికసాయం చేయాలని నిర్ణయించింది. అలాగే సిరాజ్, నిఖత్ జరీన్ లకు డీఎస్పీ ఉద్యోగాలిస్తూ నిర్ణయం తీసుకుంది. గౌరవెల్లి ప్రాజెక్టుకు రూ.437కోట్లు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

# థాంక్స్ మోడీజీ...

### మీ వల్ల 53 లక్షల కుటుంబాలకు లబ్ధి - పవన్ కళ్యాణ్



అమరావతి : తాజా ఎన్నికల తర్వాత ఏర్పడిన కూటమి సర్కార్ కు కేంద్రం వరుసగా గుడ్ న్యూస్ లు చెబుతోంది. తన రాజకీయ అవసరం కానీ, ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం కానీ ఏదో విధంగా చంద్రబాబు సర్కార్ కు శుభవార్తలు అందిస్తోంది. సీఎం చంద్రబాబు అడిగిందే తడవుగా రాష్ట్రానికి సాయం చేయడంలో ముందు ఉంటోంది. ఇందులో భాగంగా తాజాగా మరో అంశంలో కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద ఇస్తున్న పనిదినాల్ని పెంచాలని, వీటి పరిధి కూడా విస్తరించాలని ఎప్పటి నుంచో ప్రభుత్వం కోరుతోంది. తాజాగా కూటమి అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు కేంద్రానికి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. దీంతో కేంద్రం ఏపీలో ఈ ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన పని దినాల్ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు చంద్రబాబు విజ్ఞప్తికి ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకుంది. 2024-24 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధి హామీ పని దినాలు పెంచేందుకు కేంద్రం అంగీకరించడంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్రం.. రాష్ట్రంలో ఉపాధి హామీ పనిదినాల్ని 15 కోట్ల నుంచి 21.5 కోట్లకు పంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలకు ఆమోదం ఇచ్చినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. పని దినాలు పెంపునకు అంగీకరించినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పెంపు మూలంగా 53 లక్షల కుటుంబాలకు లబ్ధి కలుగుతుందని పేర్కొన్నారు.

### ఎస్సి, ఎస్టి రిజర్వేషన్ల ఉపవర్గీకరణ అంశంపై...

# సుప్రీం కీలక తీర్పు

హైదరాబాద్: ఎస్సి, ఎస్టి రిజర్వేషన్ల ఉపవర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సి, ఎస్టి రిజర్వేషన్ల ఉపవర్గీకరణ చేసుకోవచ్చని సిజెఐ జస్టిస్ డి వై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఉపవర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందంటూ తీర్పు వెలువరించింది. సుప్రీం తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వాలు తదుపరి మార్గదర్శకాలు రూపొందించుకోవాలని సూచించింది. 6:1 మెజారిటీతో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఉపవర్గీకరణ సాధ్యం కాదంటూ జస్టిస్ బేలా త్రివేది ఒక్కరే వ్యతిరేకించారు. పంజాబ్ ప్రభుత్వం, తెలుగు రాష్ట్రాల నుంచి ఎంఆర్‌పిఎస్ ఉపవర్గీకరణ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ఉపవర్గీకరణ చేయవద్దన్న నాటి తీర్పును కోర్టు కొట్టివేసింది. 2004లో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కన పెట్టింది.



### ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబురాలు...

# రేవంత్‌కు అభినందనలు



హైదరాబాద్ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పును స్వాగతించి, తెలంగాణలో వెంటనే అమలు చేస్తామని ప్రకటించేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులు, ఎమ్మెల్యేలు కృతజతలు తెలియజేశారు. శాసనసభలోని సీఎం కార్యాలయంలో స్వీట్లు తినిపించుకుని సంబురాలు జరుపుకొన్నారు. సీఎంను కలిసినవారిలో సీనియర్ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మందుల సామేల్, కడియం శ్రీహరి, తోట లక్ష్మీకాంతరావు, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, కాలే యాదయ్య, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు సైతం డప్పు దరువులతో వచ్చి ముఖ్యమంత్రిని కలిసి వర్గీకరణ సంబురాలు పంచుకొని, సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

# రామడుగు నూతన వంతెన పరిస్థితిపై అసెంబ్లీలో ప్రస్తావించండి

### - శాసనసభ పక్ష నేత మహేశ్వర్ రెడ్డికి వినతినిచ్చిన బిజెపి నాయకులు



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** రామడుగు మండల కేంద్రంలో నిర్మించిన నూతన వంతెన ఇప్పటికీ ప్రారంభించకపోవడం తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారని అట్టి సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించాలని గురువారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేకల ప్రభాకర్ యాదవ్ మహేశ్వర్ రెడ్డి తో మాట్లాడుతూ ఎమ్మెల్యేలు మారుతున్నారు కానీ నూతన వంతెన ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా ప్రస్తావించాలని, అదేవిధంగా గుండె గ్రామంలోని వంతెన కూడా శిథిలావస్థలో ఉందని ఆరు సంవత్సరాల క్రితం రెండు కోట్ల అంచనాతో టెండర్లు పిలిచి దానిని కూడా మరిచారని అన్నారు. ఈ రెండు గ్రామాలలోని వందనాలు ప్రధాన రహదారి వెంట ఉన్నాయని వాటితో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వంతెనల పరిస్థితులను అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉప్పు రామ్ కిషన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పొన్నం శ్రీనివాస్ గౌడ్, తిరుమలాపూర్ మాజీ ఎంపీటీసీ రవీందర్, మండల ఐటీ సెల్ కన్వీనర్ జయంత్, తదితరులు పాల్గొన్నారు.

# నిద్రిస్తున్న వృద్ధురాలిపై దాడి చేసి చంపిన కుక్కలు

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ముస్తాబాద్:** నిద్రిస్తున్న వృద్ధురాలిపై పిచ్చి కుక్కల దాడి చేయడంతో ఆమె మృతి చెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో సేవాలాల్ తండా గ్రామంలో పిట్ల రాజ్యలక్ష్మి( 80) అనే వృద్ధురాలు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికి పరిమితం అయ్యింది. రాజ్యలక్ష్మిని దగ్గర్లో ఉన్న ఒక గదిలో ఉంచి రోజూ అన్నపానియాలు అందిస్తున్నారు. కాగా బుధవారం కుటుంబ సభ్యులు రాత్రి వృద్ధురాలికి భోజనం చేయించి, ఇంట్లో పడుకోబెట్టి వెళ్లారు. రాత్రి నిద్రిస్తున్న సమయంలో పిచ్చి కుక్కలు ఇంట్లోకి ప్రవేశించి వృద్ధురాలిపై గుంపుగా దాడి చేశాయి. మొదటగా గొంతుపై దాడి చేసి, చంపి రాజ్యలక్ష్మి శరీరంలో చేతులు, మొహం, అవయవాలు పీక్కు తిన్నాయి. ఉదయం కొడుకులు, స్థానికులు చూసే సరికి రాజ్యలక్ష్మి తన ఇంట్లో విగత జీవిగా పడి ఉంది. దాడి చేసిన ఒక కుక్క అక్కడే ఉండటంతో ఆగ్రహించిన గ్రామ ప్రజలు దానిపై దాడి చేసి చంపేశారు. మృతురాలికి ముగ్గురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుక్కల దాడిలో రాజ్యలక్ష్మి మృతి చెందడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలి

## రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** సిరిసిల్లలో చేనేత పరిశ్రమల ఐక్య వేదిక నిర్వహిస్తున్న నిరసన దీక్షకు గురువారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి సంఘీభావం తెలిపింది. అధ్యక్షులు డా.జనపాల శంకరయ్య మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా కూడు, గూడు,గుడ్డ కల్పించాల్సిన అవసరం ఉంటుందన్నారు. ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్ చేనేత జీవితాల బతుకులపై పాట రాసి వినిపించారు. సలహా దారులు, ఐ.బి.ఆర్.ఎఫ్ సభ్యులు డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్ మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న వస్త్ర పరిశ్రమను ప్రభుత్వాలు ఆదుకోవాలని,కరెంటు సబ్సిడీని అమలు చేయాలని కోరినారు. కార్యక్రమంలో చేనేత వస్త్ర పరిశ్రమల ఐక్యవేదిక అనుబంధ సంఘాల అధ్యక్ష,కార్యదర్శులు, వస్త్ర యజమానులు,కార్మికులు,నాయకులు ఆడెపు రవీందర్, ఏనుగుల ఎల్లయ్య, తాటిపాముల దామోదర్, ఆడెపు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# గునుకుల కొండాపూర్‌లో సంబరాలు




**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ గన్నేరువరం:** రాజ్యాంగం ఎలాగైతే రాశారో మరో అంబేద్కర్ మందకృష్ణ మాదిగ అనే పేరు గుండెల మీద చేసుకుని చెప్పేటట్లు చేసిన వ్యక్తి మందకృష్ణ మాదిగ ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న నా తుది శ్వాస వరకు పోరాటం చేస్తానని నిరూపించుకున్న మరో అంబేద్కర్ మందకృష్ణ మాదిగ నీ వెంట మేమున్నామంటూ ఎన్ని రాత్రులు నిద్రలేని రాత్రులు గడిపిన వ్యక్తి శక్తి కృష్ణ మాదిగ తన ఆరోగ్యం కూడా లెక్క చేయకుండా నిరంతరం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ముందుకు నడిపించిన దేవుడు గురువారం సుప్రీంకోర్టులో ఏడుగురి న్యాయమూర్తులు సహకారంతో ఎస్సీ వర్గీకరణ నెరవేరడం జరిగింది ఎంతోమంది అమరులైనారు వారికి అంకితం ఇస్తున్నానని చెప్పిన ఘనత కృష్ణ మాదిగ దక్కుతుంది ఈ గెలుపు కృష్ణ మాదిగది కాబట్టి గునుకుల కొండాపూర్లో ఎస్సీ వర్గీకరణ సంబరాలు జరుపుకోవడం స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కొంకటి దేవరాజ్, మండల అధ్యక్షుడు కొంకట,సాయి గణేష్ బోయిని హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం ఉద్యమంలా కొనసాగాలి

### - మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి - జిల్లా కలెక్టర్ ప్రమీల సత్పతి

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** వన మహోత్సవం కార్యక్రమం మండలంలో ఉద్యమంలా కొనసాగాలని జిల్లా పాలన అధికారి ప్రమేల సత్పతి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం రామడుగు మండలం చిప్పకుర్తి, వెంకట్రావుపల్లి గ్రామాలలో 75వ వన దేవత మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించడంతోపాటుగా మొక్కలను నాటారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా సంపూర్ణ సౌకర్యాలను కల్పించాలని అన్నారు. పాఠశాల పరిసరాలు ఎక్కడ కూర చెత్తాచెదారం పిచ్చి మొక్కలు లేకుండా చూసుకోవాలని, తరగతి గదిలో గాలి వెలుతురు బాగా ఉండాలని, అవసరమైన తరగతి గదులలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీధర్, తాసిల్దార్ భాస్కర్, ఎంపీడీవో రాజేశ్వరి, మండల విద్యాధికారి వేణు కుమార్, హెచ్ఎం పద్మజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో పర్యటించాలి.. పర్యవేక్షించాలి

### - సమీక్ష సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించాలని, నిత్యం పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని కాన్ఫరెన్స్ హాలులో ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రత్యేక అధికారులు క్రమం తప్పకుండా గ్రామాల్లో పర్యటించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలని, ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేరు చేసి ఇచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. వన మహోత్సవం లో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాలని, ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని శాఖల అధికారులు తమ కార్యాలయాలు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటిని కచ్చితంగా క్లోరినేషన్ చేయించాలని, నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో జడ్పీ సీఈవో ఉమారాణి, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, డీ ఆర్డీఓ శేషాద్రి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, డీపీఓ వీర బుచ్చయ్య, జిల్లా వైద్యాధికారి వసంత రావు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, ఎస్డీసీ రాధాభాయ్, ఎస్సీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, జిల్లా వెటర్నరీ అధికారి, డీఏఓ భాస్కర్, మిషన్ భగీరథ ఈఈలు విజయ్ కుమార్, జానకి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాలకులు మారిన మా రోడ్లు మారడం లేదు

### - బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నరేష్

### - రోడ్లపై వరి నాట్లతో బిజెపి నాయకుల నిరసన

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** పాలకులు మారిన మా రోడ్లు మాత్రం మారడం లేదని రామడుగు మండల బిజెపి ప్రధాన కార్యదర్శి పోచంపల్లి నరేష్ అన్నారు. ఈ సందర్భంగా రామడుగు మండలంలోని గోపాల్ రావు పేట నుండి బూరుగుపల్లి వెళ్లే ప్రధాన రహదారి లో చిన్నపాటి వర్షానికి పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు కలుగుతున్నాయని గురువారం బిజెపి నాయకులు రోడ్లపై ఏర్పడిన గుంతలలో వరి నాట్లు నాటుతూ రోడ్ల పరిస్థితిని పాలకులకు అర్థమయ్యేలా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ గోపాల్ రావు పేట గ్రామం 30 నుండి 40 గ్రామాలకు వ్యాపార కేంద్రంగా ఉన్న గ్రామాన్ని కనీసం ఎమ్మెల్యే కూడా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వర్షపు నీరు పోవడానికి కూడా వీలు లేకుండా ఉన్నదని రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. రోడ్ల పరిస్థితులను పాలకులు పట్టించుకోకుంటే పెద్ద ఎత్తున ప్రజలతో నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కళ్లెం శివ, యువ మోర్చా మండల ఉపాధ్యక్షులు బండారి శ్రీనివాస్, బూత్ కమిటీ అధ్యక్షులు చిరంజీవి, ఎగుర్ల రవి, పరశురాం, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వీర్ల వెంకటేశ్వరరావు



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** రామడుగు మండలం కోరుటపల్లి గ్రామం తాజా మాజీ సర్పంచ్ మన్నే దర్శన్ రావు తండ్రి మన్నే దేవయ్య సోమవారం రోజున మరణించడం జరిగింది. ఈ సందర్భంగా గురువారం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రామడుగు సింగిల్విండో చైర్మన్ వీర వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కలిగేటి లక్ష్మణ్ ,మన్నె రవీందర్,మన్నే జాన్, కెనడి,తదితరులు నాయకులు ఉన్నారు.

## రామడుగు ఎమ్మార్వో గా

# వెంకటలక్ష్మి



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** రాష్ట్ర ప్రభుత్వ ఎమ్మార్వో బదిలీల్లో భాగంగా రామడుగు మండల నూతన ఎమ్మార్వో గా ఆర్ వెంకటలక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం ఎమ్మార్వో గా విధులు నిర్వహించారు. అలాగే ఇక్కడ విధులు నిర్వహించిన బత్తుల భాస్కర్ బదిలీపై శంకర్రావు పట్నం కు బదిలీ అయ్యారు. అలాగే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ భాస్కర్ గంగాధర కు బదిలీ అయ్యారు.ప్రస్తుతానికి ఆర్ ఐ పోస్టు ఖాళీగా ఉన్నది. నూతన బాధ్యతలు చేపట్టిన వెంకటలక్ష్మికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు.

## సంపాదకీయం

శుక్రవారం, ఆగస్టు 2, 2024

# అమ్మపాలు అమృతాహారం..!

అమృతతుల్యమైన అమ్మపాలలో శిశు సమగ్రాభివృద్ధికి దోహదపడే మాంసకృత్తులు, పిండి పదార్థాలు, ఐరన్, కాల్షియం, ఖనిజాలు, యాంటీబాడీలు, విటమిన్లు, కొవ్వులతో పాటు అనేక ఇతర అవసర పోషకాలు సమపాళ్ళలో ఉంటాయి. న్యుమోనియా, కలరా, కామెర్లు లాంటి పలు వ్యాధుల నుంచి శిశువును రక్షించగలిగే అమ్మ రొమ్ము పాలు జీవితాంతం వ్యాధినిరోధకశక్తిని అందించే అత్యుత్తమ సహజ టీకా ఔషధంగా పని చేస్తుంది. తల్లిపాలు అందించడంతో శిశువు ఎదుగుదలే కాకుండా తల్లి ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. బిడ్డ ప్రసవం జరగ్గానే లభించే ముర్రు పాలలో అద్వితీయ పోషక విలువలు ఉంటాయి. ముర్రు పాలతో ప్రత్యేక పోషకాలు లభించడమే కాకుండా వ్యాధికారక వైరస్‌లు, బ్యాక్టీరియాల పట్ల నిరోధకశక్తి పెరుగుతుంది. ముర్రుపాలు మంచివి కావనే దురభిప్రాయాలను దూరం చేస్తూ, రొమ్ము పాలు తప్పక కనీసం ఒక ఏడాదికి పైగా తాగించి, శిశువు జీవితకాల ఆరోగ్యానికి పుణాదులు వేయాలి. ముర్రు పాలతో శిశువు పేగుల శుద్ధి జరగడం, ఎలర్జీలను నిరోధించడం, జీవితాంతం పలు ప్రమాదకర రోగాలు రాకుండా నివారించడం, శిశు శారీరక మానసిక వికాసానికి దోహదపడడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. శిశు జననం నుంచి కనీసం ఆరు మాసాల వరకు అమ్మ రొమ్ముపాలు తప్పనిసరిగా అందించాలి. శిశువు ఆరు మాసాలు దాటిన తరువాత 1-2 ఏండ్ల పాటు అమ్మ రొమ్ముపాలు అందించడం ద్వారా పిల్లల సమగ్ర ఎదుగుదల సమకూరుతుంది. తల్లి రొమ్ముపాల ప్రాధాన్యతను మాతృమూర్తులకు వివరించడానికి ప్రతి ఏటా ఆగష్టు 01-07 వరకు 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాల'ను ఘనంగా నిర్వహించుట జరుగుతున్నది. 1992లో ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలను 170కి పైగా ఐరాస సభ్యదేశాలు పాటిస్తున్నాయి. యూనిసెఫ్, డబ్ల్యూహెచ్ఓ, స్థానిక ప్రభుత్వాలు సంయుక్తంగా తల్లిపాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాయి. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు-2024 థీమ్ 'క్లోజింగ్ ది గ్యాప్ - బ్రెస్ట్ ఫీడింగ్ సపోర్ట్ ఫర్ ఆల్' అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 7.6 మిలియన్ల శిశువులకు తల్లి పాలు అందడం లేదని, అధిక ఆదాయ వర్గాల్లో 21 శాతం, మధ్య తరగతి పిల్లల్లో 4 శాతం రొమ్ముపాల రుచిని చూడడమే లేదు. ఇండియా, చైనా, నైజీరియా, ఇండోనేషియా లాంటి దేశాల్లో తల్లిపాలు లభించని కారణంగా పలు వ్యాధులతో ప్రతి ఏట లక్షల శిశు మరణాలు నమోదు అవుతున్నాయి. భారతదేశంలో 79 శాతం ప్రసవాలు ఆరోగ్య కేంద్రాలలో జరిగినప్పటికీ, తొలి గంటలో 42.6 శాతం తల్లులు మాత్రమే రొమ్ము పాలు అందిస్తున్నారని తెలుస్తున్నది. తొలి ఆరు మాసాలు తల్లి పాలు మాత్రమే అందించి, అనంతరం అదనపు పోషకాహారంతో పాటు రొమ్ముపాలు అందించాలి. సంపన్న కుటుంబాల తల్లుల కంటే పేద కుటుంబాల తల్లులే అధికంగా చనుబాలను అందిస్తున్నారు. శిశు జననంతో తల్లి రెమ్ము పాలు ఉత్పత్తి కావడం, నవజాత శిశువు రొమ్ము పట్టి పాలు త్రాగడం, తల్లిబిడ్డల మధ్య అద్వితీయ ప్రేమానుబంధాలు ఉద్భవించడం ఓ అద్భుత సృష్టి రహస్యమనే చెప్పాలి. తల్లి రొమ్ముపాలు అందించాలనే లక్ష్యంతో ఉద్యోగిణులకు, ఉద్యోగులకు ప్రత్యేక సెలవుల సౌకర్యం కల్పించబడింది. రొమ్ముపాలు పట్టించడం వల్ల తల్లులకు రొమ్ము కాన్సర్, ఓవేరియన్ కాన్సర్, మధుమేహం, స్థూలకాయం, రక్తస్రావం, గుండె జబ్బులు, వెంటనే గర్భం దాల్చే అవకాశం లాంటి సమస్యలు రాకుండా అడ్డుకుంటాయి. తల్లి పాలు ఇవ్వడం వల్ల శారీరక సౌందర్యం తగ్గుతుందనే దురభిప్రాయంతో సంపన్న కుటుంబాల్లోని తల్లులు రొమ్ముపాలు ఇవ్వడానికి చొరవ చూపక పోవడం అమానవీయం, ఆక్షేపణీయం. తల్లిపాల పట్ల విస్తృత అవగాహన కల్పించినప్పటికి 50 శాతం తల్లులు తొలి ఆరు మాసాలు, 25 శాతం తొలి ఏడాది వరకు రొమ్ముపాలు అందిస్తున్నారని తేలింది. పేద కుటుంబాల్లో తల్లుల అనారోగ్యం, పాలు పడకపోవడం, పని ఒత్తిడిలో నిర్లక్ష్యం చేయడం, అవగాహన లేకపోవడం లాంటి కారణాలతో పిల్లలు బలహీనంగా ఉంటూ, రోగాల పాలు కావడం, కొన్ని సందర్భాలలో మరణించడం కూడా సంభవిస్తున్నాయి. కరోనా విపత్తులో పేదరికం పెరగడం, ఆర్థికంగా చితికి పోవడం, ఉపాధులు లేకపోవడంతో తల్లిపాలు అందించడంలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. గర్భిణి, తల్లి, శిశువు ఆరోగ్య రక్షణకు అవసరమైన ఆసుపత్రులను నెలకొల్పవలసిన కనీస బాధ్యత ప్రభుత్వాల మీద ఉంటుంది. తల్లి, బిడ్డలతో పాటు సకల జనుల ఆరోగ్య సౌభాగ్యాలకు పుణాదిగా నిలుస్తున్న తల్లిపాలను రక్షించి, చిన్నారులకు అందించి, ఆరోగ్య సమాజాన్ని నిర్మించే ప్రయత్నాలు చేద్దాం, లేత శిశువు ఎదుగుదలకు కంకణ బద్దులం అవుదాం. గర్భం దాల్చడం, రొమ్ముపాలు అందించడం అనే ముఖ్య అంశాలే రేపటి సమాజ నిర్మాణానికి దోహదపడతాయని గుర్తుంచుకోవాలి. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మాతశిశు ఆరోగ్యం, పోషకాహారం, పేదరిక నిర్మూలన, ఆహార భద్రత లాంటి అంశాలకు ప్రాధాన్యతలను ఇవ్వాలి.

# సోషలిస్టు మదురో మూడోసారి విజయం...!



జూలై 28న జరిగిన వెనెజులా ఎన్నికల్లో అమెరికా మద్దతు ఉన్న మితవాద, ఫాసిస్టు శక్తులు చావు దెబ్బతిన్నాయి. సోషలిస్టు పార్టీ నేత నికోలస్ మదురో మూడవసారి ఎన్నికయ్యాడు. ఆరు సంవత్సరాలు (2031వరకు) పదవిలో ఉంటాడు. ఈ ఎన్నికల్లో మదురోను ఓడించేం దుకు అమెరికా నాయకత్వంలోని వామపక్ష వ్యతిరేక శక్తులన్నీ తీవ్రంగా ప్రయత్నిం చాయి. ఎన్నికల ఫలితాల తరువాత కూడా అక్రమాలు జరిగా యని, గుర్తించబోమని నానా యాగీ చేస్తున్నాయి. మరోవైపు దేశమంతటా నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చాయి. మదురోకు మద్దతుగా కూడా అనేకచోట్ల జనం వీధుల్లోకి వస్తున్నట్లు వార్తలు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన వివరాల మేరకు మదురోకు 53.67శాతం ఓట్లు రాగా ప్రత్యర్థి ఎడ్మండో గోన్‌సాల్వెజ్‌కు 46.33శాతం వచ్చాయి. మరోవైపున ఇతగాడిని సమర్ధించిన డెమోక్రటిక్ యూనిటీ ఫ్లాట్ ఫాం(డియుపి) గోన్‌సాల్వెజ్‌కు 69.46శాతం రాగా మదురోకు 30.54శాతం వచ్చినట్లు పోటీగా ఫలితాలను ప్రకటించింది. ఇది అమెరికా కనుసన్నల్లో పనిచేసే ప్రతిపక్ష పార్టీలు, శక్తుల కూటమి.

మదురోకు వ్యతిరేకంగా ప్రదర్శలకు దిగిన శక్తుల మద్దతుదార్లు అనేక చోట్ల దివంగత మాజీ అధ్యక్షుడు హ్యూగో చావెజ్ విగ్రహాలు, చిహ్నాలను ధ్వంసం చేస్తున్నారు. చావెజ్ రాజకీయ వారసుడిగా మదురో రంగంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. మంగళవారం నాడు ఇది రాసిన సమయానికి కొందరు ప్రదర్శ కులు అధ్యక్ష భవనంపై దాడికి వెళుతున్నట్లు, దేశమంతటా రోడ్ల దిగ్బంధనానికి పూనుకున్నట్లు వార్తలు వచ్చాయి. ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని నినాదాలు చేస్తున్నారు. ముందే ఇలాంటి పరిణామాలను ఊహించిన కారణంగా రాజధాని కారకాస్ నగరంతో సహా దేశమంతటా పోలీసు, జాతీయ భద్రతా దళాలను పెద్ద ఎత్తున మోహరించారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష గోన్‌సాల్వెజ్‌కు పరిస్థితి అనుకూలంగా ఉన్నట్లు సర్వేలు పేర్కొన్నాయని, ఫలితాలు వాటిని ప్రతిబిం బించలేదని అమెరికా వ్యాఖ్యానించింది. ప్రజల ఆకాంక్షను ఫలితాలు ప్రతిబింబించ లేదని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ వ్యాఖ్యానిం చాడు. చైనా, రష్యా, క్యూబా మరికొన్ని దేశాలు మదురోను అభినందించాయి. 2018 ఎన్నికల్లో కూడా సర్వేలన్నీ మదురోకు వ్యతిరేకంగా, ప్రతిపక్ష అభ్యర్థి ముందంజలో ఉన్నట్లే చెప్పాయి. అవన్నీ మదురోను వ్యతిరేకించే శక్తులు వండి వార్చిన కతలు తప్ప మరొకటి కాదు. తన ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు కూల్చివేసేం దుకు కుట్ర జరిగిందని అధ్యక్షుడు మదురో టీవీ ప్రసంగంలో దేశ పౌరులకు చెప్పాడు. దీని గురించి ముందే తెలుసని అయితే చట్టాన్ని గౌరవిస్తామని, తన మద్దతుదార్లు ప్రశాంతంగా ఉండాలని కోరాడు."నేను నికోలస్ మదురో మోరోస్ వెనెజులా బొలివేరియన్ రిపబ్లిక్ అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికయ్యాను. మన ప్రజాస్వామ్యం, చట్టం, పౌరులను కాపాడ తాను" అని ఎన్నికల ఫలితాలు వెల్లడి కాగానే మదురో ప్రకటించాడు.

2013లో చావెజ్ మరణించిన తరువాత అధికారానికి వచ్చిన నికోలస్ మదురో అనేక సవాళ్లు, కుట్రలను ఎదుర్కొంటున్నాడు. ప్రధాన రాబడి వనరైన చమురు అమ్మకాలు, రవాణాపై అనేక ఆంక్షలు, దిగ్బంధనాలతో అమెరికా, లాటిన్ అమెరికాలోని దాని మిత్రదేశాలు, ఐరోపా యూనియన్ దేశాలూ ఇబ్బందులు పెట్టేందుకు, జనాన్ని రెచ్చగొట్టేందుకు చూస్తున్నా యి. ఎన్నికల ఫలితాలపై ప్రపంచ దేశాల స్పందన వెలువడింది. లాటిన్ అమెరికాలో వామపక్ష వాదులను సమర్ధించే దేశాలు మదురోకు శుభాకాంక్షలు పలకగా వ్యతిరేక దేశాలు ప్రతికూలంగా స్పందించాయి.

వెనెజులా కమ్యూనిస్టు పార్టీతో సహా చిలీలోని వామపక్ష ప్రభుత్వం ఎన్నికలు సక్రమంగా జరిగినట్లు వివరాలను వెల్లడించాలని ప్రకటించటం గమనించాల్సిన అంశం. సకాలంలో ఫలితాలతో పాటు పోలింగ్ కేంద్రాల వారీ ఓటింగ్ వివరాలను వెంటనే ప్రకటించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కోరినట్లు ప్రతినిధి ప్రకటించాడు. మదురోను వ్యతిరేకించే దేశాలు రంగంలోకి దిగాయి. అమెరికా దేశాల సంస్థ (ఓఏఎస్) అత్యవసర సమావేశం జరిపి ఫలితాలను సమీక్షించాలని కోరుతున్నాయి. వాస్తవాలు తేలేవరకు వెనెజులాతో దౌత్య సంబంధాలను స్తంభింపచేస్తున్నట్లు పనామా ప్రకటించింది. పూర్తి సమీక్ష జరిపే వరకు కారకాస్‌లో ఉన్న తమ దౌత్య సిబ్బందిని వెనక్కు పిలిపిస్తున్నట్లు పేర్కొన్నది.

ఫలితాలను అంగీకరించని, వ్యతిరేకించిన పనామా, పెరు, అర్జెంటీనా, చిలీతో సహా ఏడు దేశాల నుంచి తాను కూడా దౌత్య సిబ్బందిని ఉపసంహరిస్తున్నట్లు మదురో ప్రకటించాడు. ఎన్నికల పరిశీలకులను పంపిన కార్టర్ సెంటర్ కూడా పోలింగ్ కేంద్రాల వారీ ఫలితాలను ప్రకటించాలని కోరింది. ఈ సారి ఎలాగైనా మదురో, వామపక్ష శక్తులను దెబ్బతీస్తామని కలలు గన్న తిరోగామి శక్తులు ఆశాభంగం చెందినట్లు స్పందనలు వెల్లడించాయి. ఫలితాలను ఆలస్యం చేసేందుకు, లెక్కింపు ప్రక్రియను దెబ్బతీసేందుకు జరిగిన ప్రయత్నాలపై దర్యాప్తు జరుపుతున్నట్లు అటార్నీ జనరల్ తారెక్ సాబ్ ప్రకటించాడు. తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకొంటున్న లిమా విదేశీ శక్తుల బృందాన్ని ఖండిస్తున్నట్లు విదేశాంగ మంత్రి యవన్ గిల్ ప్రకటించాడు. తొత్తు ప్రభుత్వాన్ని రుద్దేందుకు ఇప్పుడే కాదు 2019లో కూడా ప్రయత్నించారని అన్నాడు. వెనెజులా చట్టం ప్రకారం స్వతంత్ర పరిశీలకు ప్రతి పోలింగ్ బూత్‌లో లెక్కింపు జరిగి ఫలితాలను సరిచూసేందుకు, రాతపూర్వంగా ఫలితాలను పొందేందుకు అవకాశం ఉంది. ఫలితాలు వెలువడి మదురో గెలిచినట్లు ప్రకటించిన తరువాత అంతర్జాతీయ పరిశీలకుల తనిఖీకి అనుమతించాలని ప్రతిపక్షాలు కొత్తపల్లవి అందుకున్నాయి. గత పాతికేండ్లుగా వెనెజులాలో వామపక్ష ఉద్యమం, ప్రభుత్వాలను కూల్చివేసేందుకు దేశంలోని తిరోగామి శక్తులు, వాటికి మద్దతిస్తున్న అమెరికా చేయని కుట్ర లేదు. ఫాసిస్టు శక్తులు ఎప్పటికప్పుడు ఊసరవెల్లి మాదిరి రూపాన్ని మార్చుకొని ముందుకు వస్తున్నాయి. జనంలో వాటికి ఆదరణ లేకపోవటంతో జాతీయవాదంతో ఆకర్షించాలని చూస్తున్నాయి. అమెరికా తొత్తులుగా పనిచేస్తున్నాయి. ఎన్నికుట్రలు చేసినా, ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు కలిగించినా అధికారానికి వచ్చిన వామపక్షశక్తులు ఉన్నంతలో కార్మికవర్గాన్ని కాపాడేందుకు చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాల కారణంగా వాటి ఆటలు సాగటం లేదు.

దీని అర్ధం వెనెజులాకు వాటితో ముప్పు లేదని కాదు. మదురో అనుసరిస్తున్న విధానాలన్నీ సరైనవే అని కాదు. వెనెజులా ఎన్నికల్లో పాల్గొనేవారి శాతం క్రమంగా తగ్గుతున్నది. మదురో విధానాలను కాపాడుకోవాలని జనాల్లో కోరిక బలంగా ఉంటే ఎన్నికల్లో పాల్గొనేవారి శాతం పెరగాల్సి ఉంది. కానీ 2013లో 79.65శాతం మంది పాల్గొంటే 2018లో 45.73శాతానికి పడిపోయింది. ఈ సారి 44.85శాతానికి తగ్గింది. 2018 ఎన్నికల్లో మదురోకు 67.85శాతం ఓట్లు రాగా ఇప్పుడు 53.67శాతమే వచ్చాయంటే కొన్ని తరగతుల్లో అసంతృప్తి ఉందన్నది స్పష్టం. పోయినసారి మదురో మీద పోటీచేసిన ప్రత్యర్ధులలో ఇద్దరికి 20.93-10.75 శాతాల చొప్పున వచ్చాయి. ఈ సారి ఒకే అభ్యర్థి రంగంలో ఉన్నాడు. చావెజ్ అనుసరించిన సామ్రాజ్యవాద వ్యతిరేక విధానాలను మదురో కూడా కొనసాగిస్తున్నప్పటికీ అంతర్గత విధానాల మీద వెనెజులా కమ్యూనిస్టు పార్టీ(పిసివి) ఇతర కొన్ని వామపక్ష పార్టీలు విమర్శనాత్మక వైఖరితో ఉన్నాయి. లాటిన్ అమెరికాలో అధికారానికి వచ్చిన ఇతర వామపక్ష నేతల మాదిరిగానే మదురో కూడా పెట్టుబడిదారీ విధాన పునాదులను ముట్టుకోకుండా సంస్కరణలతో, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమాన్ని విబేధించిన వామపక్ష శక్తులను సహించటం లేదని కమ్యూనిస్టు పార్టీ విమర్శించింది.

గతంలో చావెజ్, మదురో ప్రభుత్వానికి వెలుపలి నుంచి మద్దతు ఇచ్చిన కమ్యూనిస్టు పార్టీ ఇటీవలి సంవత్సరాలలో మదురో విధానాలతో విబేధిస్తున్నది. తన విధానాలను విమర్శించిన వామపక్ష శక్తులను ప్రతి పక్షపార్టీల ఏజెంట్లుగా మదురో దాడి చేశాడు. చావెజ్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చూస్తే ఏ కమ్యూనిస్టు లేదా వామపక్ష పార్టీగానీ ప్రతిపక్ష మితవాద శక్తులను సమర్ధించిన దాఖలా లేదు. విమర్శనాత్మకంగా ఉంటూనే సోషలిస్టు ప్రభుత్వాలకు మద్దతు ఇచ్చాయి.


## భారతీయ జీవశాస్త్ర పితామహులు!



పుష్ప మిత్ర భార్గవ ( ఫిబ్రవరి 22, 1928 – ఆగష్టు 1, 2017) (పి.ఎం.భార్గవ) భారత దేశపు అగ్రశ్రేణి శాస్త్రవేత్తలలో ఒకరు. సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (%జజవీదీ%) వ్యవస్థాపక డైరెక్టర్.

భారత దేశంలో బయోటెక్నాలజీ రంగంలో మార్గదర్శకుడు మరియు "జెనెటిక్ ఇంజనీరింగ్" అనే పదాన్ని ఉపయోగించిన మొదటి వ్యక్తులలో ఒకరు. ఆయన హైదరాబాదులో మెడికల్ అవేర్ మరియు రెస్పాన్సిబుల్ సిటిజన్స్ ఛైర్మన్ కూడా. భార్గవ 1928 ఫిబ్రవరి 22 న అజయ్మేరు ( రాజస్థాన్ ) లో ఒక మధ్య తరగతి కుటుంబంలో, వైద్యుడు, ప్రజారోగ్య నిపుణుడైన రామ్ చంద్ర భార్గవ, గాయత్రి భార్గవ దంపతులకు జన్మించారు. 29ఏళ్ళప్రాయంలో కుటుంబం వారణాసికి మారగా, నేరుగా తొమ్మిదవ తరగతికి నేరుగా బెసెంట్ థియోసాఫికల్ స్కూల్లో చేరారు. పాఠశాల తర్వాత, అతను ఆ సమయంలో ఉత్తర ప్రదేశ్‌లోని ఉత్తమ సంస్థలలో ఒకటైన క్వీన్స్ కాలేజీ నుండి ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. 1944 లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ తో బీఎస్సీ, 1446లో ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ అలాగే 1949 లో 21 సంవత్సరాల వయస్సులో సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీ హెచ్ డీ పూర్తి చేశారు.

## కోర్టు తీర్పు సామాజిక న్యాయ విరుద్ధం..!



దేశంలో మెజార్టీ వర్గమైన బీసీ వర్గాల జనగణన చేపట్టాలని, జనాభాకి అనుగుణంగా సమాజ సంపదలో న్యాయమైన వాటా అందించాలనే డిమాండ్‌కు అర్ధశతాబ్దపు చరిత్ర ఉన్నది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2014 ఎన్నికలకు ముందు బీసీ జనగణ చేపడతామని హామీ ఇచ్చి, ఆ పిదప.. అగ్రవర్ణాల ఒత్తిళ్లకు తలొగ్గి ఆ అంశంపై వెనక్కి తగ్గింది. కానీ దేశ చరిత్రలోనే మొదటిసారిగా.. బిహార్ ప్రభుత్వం 2022లో రాష్ట్రస్థాయిలో కుల జనగణన చేపట్టింది. ఆ సర్వేలో తేలిన అంశాల నేపథ్యంలో.. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల రిజర్వేషన్ల శాతాన్ని 65 శాతానికి పెంచుతూ చట్టం చేసింది. అయితే రిజర్వేషన్ వ్యతిరేకులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో కేసు వేశారు. తాజాగా.. మొన్నటి జూన్ 20న తీర్పునిచ్చిన పాట్నా హైకోర్టు.. సదరు రిజర్వేషన్ల పెంపును కొట్టివేసింది. తమకు దక్కాల్సిన సామాజిక న్యాయం దక్కుతుందని దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మెజార్టీ వర్గాలను పాట్నా హైకోర్టు తీర్పు నిరాశకు గురిచేసింది. పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పు.. భారత రాజ్యాంగం నిర్దేశించిన సామాజిక న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా నిలబడిందన్నది సుస్పష్టం. 1980లో వెలుగు చూసిన మండల్ కమిషన్ నివేదిక.. ఎస్సీ, ఎస్టీల లాగా..


ఇతర వెనుకబడిన తరగతుల వారు సైతం అనేక రకాల వివక్షకు గురవుతున్నారని, ఆ వర్గాలకు విద్యావకాశాల్లో, ప్రభుత్వ ఉద్యోగాలలో సమ ప్రాతినిధ్యం ఇంకా దక్కలేదని తేల్చి చెప్పింది. 1990లో విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికని ఆమోదించడంతో పాటు, బీసీ వర్గాలకు విద్యావకాశాలు, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్స్ సౌకర్యం కల్పించింది. ఈ నివేదికలో.. జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్ పరిమాణం ఉండాలని తేల్చిచెప్పి, తాజా లెక్కలు లేవు కాబట్టి.. 1931 నాటి జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకుని బీసీ రిజర్వేషన్లను 27 శాతంగా నిర్ణయించింది. బీసీల రిజర్వేషన్ సక్రమంగా అమలు కావాలంటే రాబోయే జనాభా లెక్కల్లో విధిగా బీసీ వర్గాల జనాభా లెక్కలు సైతం సేకరించాలని సిఫార్సు చేసింది. ఇందుకు అనుగుణంగా బిహార్ ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో కులాల వారీ జనగణన చేపట్టి తదనుగుణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకి సమ ప్రాతినిధ్యం అందించే దిశలో రిజర్వేషన్ల పెంపుకు పూనుకున్నది. అన్ని వర్గాల రిజర్వేషన్లు కలిపి 50 శాతానికి మించకూడదంటూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉటంకించిన పాట్నా హైకోర్టు.. 50 శాతం పరిమితి దాటినందున రిజర్వేషన్ల పెంపు రాజ్యాంగ విరుద్ధమని తేల్చి చెప్పింది. బిహార్ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం సమానతా సూత్రాలకు సైతం విరుద్ధమంటూ న్యాయమూర్తులు పేర్కొన్నారు. నిజానికి ఈ 50 శాతం పరిమితి అనేది రాజ్యాంగంలో ఎక్కడా పేర్కొనబడలేదు. కేవలం 1992లో సుప్రీంకోర్టు వెలువరించిన ఇంద్రా సాహ్నీ తీర్పులో.. రిజర్వేషన్లకు 50 శాతం పరిమితి ఉండాలంటూ మొదటిసారిగా ప్రస్తావించింది. 1985లో వెలువడిన కె.సి. వసంత్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక తీర్పులో భాగంగా జస్టిస్ చిన్నప్పరెడ్డి ప్రతిభ పేరుతో అగ్రవర్ణాలు రచించే కుట్రలను ఎండగట్టారు. రిజర్వేషన్ ద్వారా ఉద్యోగంలో చేరిన వారు సమర్ధంగా పనిచేయలేరన్నది ఒక తప్పుడు ఊహ మాత్రమే. తమకే పరిమితమైన ఒక పవిత్రపు ఆవరణలోకి ఇతరులు ప్రవేశిస్తే కలుషితమవుతుందంటూ స్వార్థపర వర్గాలు ప్రచారంలో పెడుతున్న ఒక దుర్మార్గపు ఆలోచన మాత్రమే అది. రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి మించితే ప్రతిభ దెబ్బతింటుందనడానికి సైతం ఎలాంటి శాస్త్రీయ ప్రాతిపదిక లేదు! అంటూ తేల్చేసాడాయన. ఆర్టికల్ 16 ప్రకారం.. తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన తరగతి పౌరుల నియామకాల కోసం రిజర్వేషన్ నిబంధనను రాజ్యం రూపొందించాలి. 78 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత సైతం వెనుకబడిన తరగతులకు ఇంకా ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం లేదన్నది సుస్పష్టం. కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు 90 మంది ఉంటే అందులో కేవలం ముగ్గురే ఓబీసీలు ఉన్నారని పోయిన ఏడాది సెప్టెంబర్‌లో పార్లమెంటులో ఇవ్వబడిన సమాచారం తేల్చి చెప్పింది.

# డబుల్ ఇస్మార్ట్ టీంలో టెన్షన్....



పూరి జగన్నాథ్, రామ్‌ల క్రేజీ కాంబినేషన్లో తెరకెక్కుతున్న చిత్రం.. డబుల్ ఇస్మార్ట్. నాలుగేళ్ల కిందట బ్లాక్‌బస్టర్ అయిన 'ఇస్మార్ట్ శంకర్'కు ఇది సీక్వెల్ అన్న సంగతి తెలిసిందే.మామూలుగా ఒక హిట్ మూవీ సీక్వెల్ వస్తుంటే.. మంచి బజ్ క్రియేట్ అవుతుంది. బిజినెస్‌కు ఢోకా ఉండదు. సక్సెస్ మీద కూడా టీం ధీమాగా ఉంటుంది. అలాగే థియేటర్ల సమస్యలు కూడా ఉండవు. కానీ 'డబుల్ ఇస్మార్ట్' విషయంలో పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి.పూరి చివరి సినిమా 'లైగర్' డిజాస్టర్ కావడం ఆయన మీద విపరీతమైన ప్రెజర్ పెంచింది. ఆ సినిమా నష్టాలను సెటిల్ చేయాల్సిన స్థితిలో పూరి 'డబుల్ ఇస్మార్ట్'ను మొదలుపెట్టారు. దీంతో కచ్చితంగా ఈ సినిమాను హిట్ చేసి తీరాలి. కానీ రిలీజ్ దగ్గర పడేకొద్దీ ఈ సినిమాను సమస్యలు చుట్టుముడుతున్నాయి. ముందేమో ఆగస్టు 15 లాంటి క్రేజీ డేట్ దక్కిందని సంబరపడ్డారు. ఆ సీజన్లో రిలీజయ్యే పెద్ద సినిమా ఇదొకటే అనుకున్నారు. కానీ తమిళ అనువాద చిత్రం 'తంగలాన్' పోటీకి వచ్చింది. అయినా పర్లేదనుకున్నారు. రవితేజ సినిమా అంటే ప్రేక్షకుల ఫస్ట్ ఛాయిస్ అదే అవుతుంది. 'తంగలాన్' కొత్తదనం కోరుకునే ప్రేక్షకుల దృష్టిని బాగానే ఆకర్షిస్తోంది. మరోవైపు 'ఆయ్' అనే చిన్న సినిమా కూడా పోటీలో ఉంది. దాని కంటెంట్ మీద నిర్మాతలు ఎంతో ధీమాగా ఉన్నారు. కాబట్టి పోటీ పెద్ద సమస్యే. మరోవైపు 'మార్ ముంత చోడ్ చింత' పాటకు సంబంధించిన వివాదం వల్ల కొందరేమో 'డబుల్ ఇస్మార్ట్'ను బహిష్కరిస్తామంటున్నారు.

## మ్యూజిక్ సిట్టింగ్స్‌లో విక్రమ్ కే దాస్...!



ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ పతాకంపై నిర్మాత కంచర్ల అచ్యుత రావు నిర్మించబోయే 8వ చిత్రం 'విక్రమ్ కే దాస్'. ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగు తున్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే రీతిలో కథ, కథనంతో ఈ సినిమాని తెరకెక్కించబోతున్నారు. నిర్మాత కంచర్ల అచ్యుత రావు, దర్శకుడు బాలు పొలిచెర్ల ప్రత్యేక శ్రద్ధతో మ్యూజిక్ సిట్టింగ్స్‌లో పాల్గొంటున్నారు. సంగీత దర్శకుడు పృథ్వి వీనుల విందుగా సంగీతం అందిస్తున్నారు అని చిత్ర యూనిట్ నమ్మకంగా చెబుతోంది.

యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌తో రూపొందు తున్న చిత్రం అయినప్పటికీ సంగీతానికి కూడా మంచి ప్రాధాన్యత ఉంటుందని దర్శక, నిర్మాతలు చెబుతున్నారు. ఈ బ్యానర్ మీద ఇప్పటికే 'ఉపేంద్ర గాడి అడ్డా' సినిమా విడుదలై, చక్కని విజయం అందుకుంది. కాగా, రెండవ సినిమాగా 'కంచర్ల' వచ్చే నెలలోనే విడుదల కానుంది. ఈ నేపథ్యంలో 8వ చిత్రంగా 'విక్రమ్ కే దాస్' సినిమాతో హీరో కంచర్ల ఉపేంద్ర మాస్ ఇమేజ్ సంపాదించడం ఖాయం అంటున్నారు. ఈ బ్యానర్ మీద ఒకేసారి ఎనిమిది సినిమాల నిర్మాణం జరగడం ఒక రికార్డుగా చెప్పుకుంటున్నారు.

## 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అభయహస్తం...!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హోల్డ్‌లో పెట్టిన మూడు చిత్రాల్లో 'ఉస్తాద్ భగత్ సింగ్' ఒకటి. ఐతే పవన్ మళ్లీ అందుబాటులోకి వస్తే.. ఆయన ప్రయారిటీ లిస్ట్‌లో ఇదే చివరన ఉంటుందనే అభిప్రాయాలున్నాయి.కొందరేమో ఈ సినిమా ముందుకు కదలడం కష్టమని.. మధ్యలో ఆపేస్తారని కూడా అంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ ప్రచారం గురించి ఇటీవల 'మిస్టర్ బచ్చన్' ప్రెస్ మీట్లో దర్శకుడు హరీష్ శంకర్‌ను అడిగితే..

సమాధానం దాటవేశాడు. ఫ్యాన్స్ గురించి ప్రస్తావిస్తే నేను వాళ్లతోనే మాట్లాడుకుంటాను అనేశాడు.ఐతే తాజాగా ఒక ఇంటర్వ్యూలో హరీష్ ఈ చిత్రం గురించి మాట్లాడాడు. పవన్ కోసం ఎదురు చూస్తున్నామని.. ఆయన వీలును బట్టి సినిమా పూర్తవుతుందని చెప్పిన హరీష్.. ఈ చిత్రం చాలా ఏళ్ల పాటు అభిమానులు గుర్తుంచుకునేలా ఉంటుందని వ్యాఖ్యానించాడు."పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అందరూ 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాను జీవితాంతం గుర్తుపెట్టుకుంటారు. ఇంతకుముందు క్యాసెట్లు, డీవీడీలు దాచుకునేవాళ్లం కదా. అలా లైబ్రరీలో దాచుకునే సినిమా. పవన్ కళ్యాణ్ సినిమా అంటే ఏం ఆశించి థియేటర్లకు వస్తారో అవన్నీ సంపూర్ణంగా ఉండే సినిమా. ఫ్యాన్స్ రిపీట్స్‌లో ఈ సినిమ్మ చూస్తారు" అని హరీష్ తెలిపాడు. ఈ సినిమా చాలా ఆలస్యం కావడం, తన కెరీర్లో విలువైన కొన్నేళ్లు వేస్ట్ అయిపోవడం గురించి ప్రస్తావించగా.. "ముందు నా కెరీర్లో గ్యాప్ రావడానికి కరోనా కారణం. దాని వల్ల కొంచెం టైం వేస్ట్ అయింది. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ గారికి ఉన్న వేరే కమిట్మెంట్ల వల్ల నా సినిమా సెట్స్ మీదికి వెళ్లడంలో ఆలస్యం జరిగింది. ఇందులో రాజకీయాలు ఉన్నాయని నేను అనుకోను. పవన్ గారిని మరో దర్శకుడు మెప్పించి తన చిత్రాన్ని ముందుకు తీసుకెళ్లాడంటే అది అతడి ప్రతిభ.

సమాధానం దాటవేశాడు. ఫ్యాన్స్ గురించి ప్రస్తావిస్తే నేను వాళ్లతోనే మాట్లాడుకుంటాను అనేశాడు.ఐతే తాజాగా ఒక ఇంటర్వ్యూలో హరీష్ ఈ చిత్రం గురించి మాట్లాడాడు. అంతే తప్ప నేను ఎవరినీ నిందించను.

'ఉస్తాద్ భగత్ సింగ్' ఆలస్యం కావడంతో నేను 'మిస్టర్ బచ్చన్' మొదలుపెట్టి ఏడు నెలల్లో పూర్తి చేశా. నా కెరీర్లోనే అత్యంత వేగంగా తీసిన సినిమా ఇది. ఇక ముందు మరింత వేగంగా మూవీస్ చేస్తా" అని హరీష్ అన్నాడు.

## పుష్ప మీద మళ్ళీ మొదలైన ప్రచారాలు



డిసెంబర్ 6 పుష్ప 2 ది రూల్ వచ్చేస్తుందనే ధీమా అభిమానుల్లో బలంగా ఉంది. ఆగస్ట్ 15 లాంటి మంచి డేట్ వదులుకోవడం పట్ల నిర్మాతలు కలవరపడుతున్నా పరిస్థితులు దానికి ప్రేరేపించాయి కాబట్టి ఎవరూ ఏం చేయలేరు.ప్రస్తుతం దర్శకుడు సుకుమార్ షూటింగ్ ని రీ స్టార్ట్ చేశారు.

త్వరలో అల్లు అర్జున్, ఫహద్ ఫాసిల్ కు సంబంధించిన ముఖ్యమైన ఎపిసోడ్స్ ని ప్లాన్ చేశారని తెలిసింది. నిజానికి రిలీజ్ డేట్ మిస్ కావడంలో ప్రధాన పాత్ర పోషించిన కారణాల్లో ఫహద్ డేట్లు దొరక్కపోవడం కూడా ఉంది. సరే అంతా సవ్యంగా ఉంది కదా కొత్త ప్రచారాలు ఏంటనుకుంటున్నారా.

## ఆసక్తి రేపుతున్న 'సంతాన ప్రాప్తిరస్తు'!





చిన్న సినిమాల్లో వైవిధ్యం ఉంటే ఆదరణ ఉంటుందని ప్రేక్షకులు ఎప్పటికప్పుడు ఋజువు చేస్తూనే ఉన్నారు. కంటెంట్ బలంగా ఉంటే క్యాస్టింగ్ పెద్ద విషయమే కాదు. ఈ సూత్రాన్నే నమ్ముకుని వస్తున్న సినిమా సంతాన ప్రాప్తిరస్తు. మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి సంయుక్తంగా మధురా ఎంటర్ టైన్మెంట్స్, నిర్వి ఆర్ట్స్ పతాకంపై నిర్మించిన ఈ మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ఫస్ట్ లుక్ అధికారికంగా విడుదలయ్యింది. ఏబీసీడి లాంటి వినోదాత్మక చిత్రాన్ని అందించిన సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించగా టైటిల్ నుంచే ఆసక్తికరంగా కనిపిస్తోంది.విక్రాంత్, చాందిని చౌదరి జంటగా ఇటీవలే సంతాన ప్రాప్తిరస్తు రెగ్యులర్ షూటింగ్ మొదలయ్యింది.

తాజాగా వదిలిన పోస్టర్ లో హీరో చేతిలో ఉన్న వస్తువులు, చుట్టూ ఉన్న ఐటమ్స్ ఏదో వీర్యకణాలను లెక్కబెట్టే టైపులో వినూత్నంగా అనిపిస్తున్నాయి. డిఫరెంట్ పాయింట్ తో కొత్తగా ఏదో చెప్పాలనే ప్రయత్నం చేశారు.

మధ్యతరగతికి చెందిన ఒక సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా విక్రాంత్ పాత్ర ఇందులో వైవిధ్యంగా ఉండబోతోంది. ఎక్కువ డీటెయిల్స్ రివీల్ చేయకపోయినా కంటెంట్ మీద నమ్మకం కలిగేలా మేకర్స్ తీసుకున్న జాగ్రత్త స్పష్టంగా ఉంది. దీనికి స్క్రీన్ ప్లే షేక్ దావూద్ సమకూర్చారు. వేంకటాద్రి ఎక్స్ ప్రెస్, ఎక్స్ ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి సూపర్ హిట్స్ పని చేసిన అనుభవంతో సంతాన ప్రాప్తిరస్తుకి తన కలం ఇచ్చారు.


## 25 సంవత్సరాల 'రాజకుమారుడు' ప్రయాణం...!



ఇవాళ ఘట్టమనేని అభిమానులకు చాలా ప్రత్యేకమైన రోజు. సరిగ్గా పాతికేళ్ల క్రితం ఇదే రోజు జూలై 30న మహేష్ బాబు హీరోగా మొదటి సినిమా రాజకుమారుడు విడుదలయ్యింది.సూపర్ స్టార్ కృష్ణ లెగసినీ కొనసాగించే వారసుడిగా ఆ సమయంలో మహేష్ మీద ఉన్న అంచనాలు మాములువి కాదు.బాలనటుడిగా పలు చిత్రాల్లో మెప్పించినప్పటికీ సోలో హీరోగా మారే క్రమంలో ఎన్నో పరిణామాలు జరిగాయి. 1990లో బాలచంద్రుడు రిలీజయ్యాక మేకప్ కు స్వస్తి చెప్పిన మహేష్ పూర్తిగా చదువుకు అంకితమైపోయాడు. 1993లో యమలీల కథతో ఎస్వి కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డిలు వచ్చినప్పుడు కృష్ణ కొన్నాళ్ళు ఆగమన్నారు.

అంత ఎదురుచూసే పరిస్థితి లేకపోవడంతో అలీ హీరోగా రూపొంది బ్లాక్ బస్టర్ సాధించింది. అదే సమయంలో అగ్నిపర్వతం లాంటి ఎవర్ గ్రీన్ బ్లాక్ బస్టర్స్ ఇచ్చిన కృతజ్ఞతతో వైజయంతి మూవీస్ అధినేత అశ్వినిదత్ చేసిన అభ్యర్థనని కృష్ణ మన్నించి మహేష్ బాబు డెబ్యూ బాధ్యతలు ఆయనకు అప్పజెప్పారు. ఆ సమయంలో మంచి స్వింగ్ లో ఉన్న పరుచూరి బ్రదర్స్ చెప్పిన కథ సింగల్ సిట్టింగ్ లో ఓకే అయిపోయింది.

## తమిళ ఇండస్ట్రీలో అగ్గి రాజుకుంది.....!



తమిళ నిర్మాతల మండలి తాజాగా తీసుకున్న నిర్ణయాల మీద ఆ ఇండస్ట్రీలోనే కాదు.. తెలుగు సినీ పరిశ్రమలో కూడా చర్చ జరుగుతోంది. నిర్మాతల దగ్గర భారీ స్థాయిలో అడ్వాన్సులు తీసుకుని..ఆ చిత్రాలను ముందుకు తీసుకెళ్లకుండా వేరే ప్రాజెక్టులు కమిటవడం.. కొందరు నిర్మాతలకు ఎంతకీ సినిమాలు చేయకపోవడం లాంటి చర్యలను ఖండిస్తూ కొన్ని సంచలన తీర్మానాలు చేసింది కోలీవుడ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్. ప్రస్తుతం సెట్స్ మీద ఉన్న సినిమాలు పూర్తి చేయడానికి డెడ్ లైన్ పెట్టడమే కాక.. కొత్త చిత్రాలు మొదలుపెట్టడానికి వీల్లేదని కూడా తేల్చేశారు.ప్రధానంగా ధనుష్ మీద ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ గుర్రుగా ఉంది. తనతో సినిమాలు చేయాలనుకునే నిర్మాతలు ముందు తమను సంప్రదించాలని స్పష్టం చేసింది. మరోవైపు హీరో విశాల్ వ్యవహార శైలి మీద కూడా నిర్మాతల మండలి ఆగ్రహంతో ఉంది. కొంత కాలంగా కౌన్సిల్‌కు, విశాల్‌కు మధ్య గొడవ నడుస్తున్న సంగతి తెలిసిందే.ధనుష్‌తో పాటు విశాల్ మీద నిషేధం విధించే ఆలోచన కూడా నిర్మాతల మండలి చేసిందని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో విశాల్ కార్యదర్శిగా, నాజర్ అధ్యక్షుడిగా ఉన్న నడిగర్ సంఘం రంగంలోకి దిగింది.